# లోక విద్యా ప్రపంచం

పక్షపత్రిక

బులెటెన్ - 2 జనవరి 16 - 2012 సంపాదకుడు & ప్రచురణ కర్త : టి. నారాయణ రావు వెల. రూ. 2


## ప్రమాదంలో దేశ సార్వభౌమత్వం

10 లక్షల జనాభాగల పట్టణాలలో విదేశి రిటైల్ మార్కెట్ల అనుమతికి సంబంధించిన బిల్లు పార్లమెంట్‌లో తాత్కాలికంగా నిలుపుచేయబడ్డా, అది శాశ్వతంగా నిలిచిపోయిందని భావించడానికి వీలులేదు. నూతన ప్రపంచ ఆర్థిక సరళీకృత విదానాలకు ఏనాడైతే ఆసియా, ఆఫ్రికా లాటిన్ అమెరికన్ దేశాలు తలుపులు బార్లా తెరిచాయో, ఆనాడే అవి తమ దేశ సార్వభౌమత్వాన్ని, దేశ ప్రజల శ్రేయస్సును విస్మరించాయి. 19వ శతాబ్దిదాకా నిరాటకంగా సాగిన వలస దోపిడి తన పాత దుస్తులను విప్పి 'కార్పొరేట్ల'గా నూతన వస్త్రాలతో మనముందు నిలబడింది.

భారతదేశంలో వ్యవసాయాధారిత వృత్తులైన టోకు, చిల్లర ఆహార ధాన్యాల ప్రజాపంపిణి వ్యవస్థ సమాజంలో అంతర్భాగంగా కోటానుకోట్ల కుటుంబాలకు జీవనాధారంగా ఉంటూ వచ్చింది. అయితే ప్రపంచీకరణ నేపథ్యంలో విదేశీ కార్పొరేట్ సంస్థలకు యీ దేశ చిల్లర వ్యాపారంలో ప్రవేశించడానికి వెసులుబాటు దొరికింది. ప్రస్తుతం అధికారంలో ఉన్న యు.పి.ఎ. ప్రభుత్వం విదేశీ కంపెనీలనురిటైల్ మార్కెట్లలోకి అనుమతి ద్వారా దేశంలోని వినియోగదారులు, రైతులు, చిన్నతరహా ఉత్పత్తిదారులు సరసమైన ధరలకు, నాణ్యమైన సరుకులు పొందడమేగాక తమ ఉత్పత్తులకు సరియైన గిట్టుబాటు ధరలను పొందగలరని నమ్మబలుకుతున్నది. అయితే సమాజంలో కోట్ల సంఖ్యలో ఉన్న చిల్లర వ్యాపారస్తుల భవిష్యత్తును గురించి ఏమీ మాట్లాడటంలేదు. 10 లక్షల జనాభా గల పట్టణాల్లో మాత్రమే విదేశి రిటైల్ మార్కెట్లను అనుమతించడంవల్ల రిటైల్ వ్యాపారస్తులకు పెద్దగా నష్టం ఉండదనే అసత్యాన్ని ప్రచారం చేస్తోంది. నిజానికి విదేశి రిటైల్ మార్కెట్లు పల్లెటూళ్ళలో నిర్వహించడానికి వీలుపడదు. కాగా అత్యధిక రిటైల్ వ్యాపారము పట్టణాలలోనే జరుగుతుంది. కాబట్టి, తమ వృత్తుల నుండి నిర్వాసితులయ్యే రిటైల్ వ్యాపారస్తుల సంఖ్య 80% నుండి 90% దాకా ఉండగలదు.

ఈ దేశ పాలకవర్గం తమ రాజకీయ చదరంగంలో పావులుగా వివిధ సామాజిక వర్గాలను ఒకరికొకరిని ఎదురుగా నిల్పి శత్రుత్వ భావనలు పెంపొందించడం ఒక విధానంగా పెట్టుకున్నాయి. ఈ రోజు ప్రస్తుత ప్రభుత్వం 'రిటైల్' సామాజిక వర్గానికి ఎదురుగా వినియోగదారులు, రైతులు చిన్నతరహా ఉత్పత్తి దారులను శత్రువులుగా నిలబెట్టాలని చూస్తోంది. ఇదే తరహాలో ముడి ఖనిజాల ఉత్పత్తి, తద్వారా తయారయ్యే సరుకులు, ఉద్యోగ అవకాశలను ఎరగా చూపించి, తరతరాలుగా అడవి తల్లిఒడిలో హాయిగా బ్రతుకుతున్న గిరిజన సమూహాలను వారి నివాస స్థానాలనుంచిగెంటి వేయడానికి చేస్తున్న ప్రయత్నాలను మనం చూస్తున్నాం. ఈదేశం వలస పాలనలో మగ్గుతున్నప్పుడు 'నాణ్యమైన బట్టలు' వినియోగదారుడికు అందించే మిషతో కోటాను కోట్ల చేనేత యితర లోకవిద్యాధరుల జీవితాలను పెనుచీకట్లలోనికి నెట్టడం మనం చూశాం. ఈ సందర్భంగా గాంధీగారి మాటల్లో "నాసోదర చేనేత కార్మికుడు ఉపాధి కోల్పోతుండగా నేనెలా బాగుండగలను" ఈ విదేశి నిరసన వెల్లువే స్వాతంత్ర్య పోరాటానికి నాందిగా నిల్చింది. ఇదే మనకు నిత్య స్ఫూర్తి, సందేశం.

అయితే ఏ మాటకామాటే చెప్పుకోవాలి. బ్రిటిష్‌వాడు 'ఇండియా వ్యాపార వర్గం నిజాయితి లేనిది" అనే మాట ప్రత్యక్షంగా చెప్పినట్టుగానే ఈదేశ టోకు చిల్లర వ్యాపార వర్గంపై ప్రజలకు సదాభిప్రాయం లేని మాట వాస్తవం. వాళ్ళు రైతుల సామాన్య వినియోగదారుల 'దోపిడిదార్లుగా' పేరుగడించారు. కృత్రిమ సరకుల కొరత, నల్లబజార్లు, కల్తీ నాణ్యమైన పొగాకు మధ్యలో చెత్తను ఎగుమతి. తప్పుడు తూనికలు వాళ్ళ హస్త లాఘవానికి ప్రత్యక్ష నిదర్శనాలు. ప్రభుత్వం చిత్తశుద్ధి లేని చట్టాలెన్ని చేసినా అవి సామాన్య వినియోగదారులకు రక్షణ కల్పించలేకపోయాయి. కొన్ని రాజకీయ పార్టీలు, స్వచ్ఛంధ సంస్థలు విదేశి రిటైల్ మార్కెట్లపట్ల తమ వ్యతిరేకతను ప్రకటించగా జన బాహుళ్యం నుండి తగిన నిరసన వెల్లువలు పెల్లుబకపోవడానికి కారణం యిదే! అయితే దేశ అంతరంగిక ఆహార భద్రత అనే అతిముఖ్య అంశాన్ని విదేశీ ప్రైవేటు వ్యాపార సంస్థల చేతిలో ఉంచడం ఏమాత్రం సరియైందికాదు. రైతును, వినియోగదారుణ్ణి అవినీతి వ్యాపార వర్గంనుంచి రక్షించడానికి రాష్ట్ర, కేంద్రస్థాయిలో చేసిన చట్టాలను అటకమీది నుంచి దించి బూజుదులపాలి. పాలనా యంత్రాంగం నిక్కచ్చిగా వ్యవహరించి వినియోగదారుల రక్షణ చర్యలు చేపట్టాలి. అంతేగాని దీనిని సాకుగా చూపి కోట్ల మంది చిల్లర వ్యాపారస్తుల జీవితాలతో ఆడుకోకూడదు. ఉపాధి కోల్పోయిన చిల్లర వ్యాపారస్తులకు కనీస వేతన చట్టం అమలుచేసి ఆమొత్తాన్ని చిల్లర వ్యాపారం నిర్వహించే బహుళజాతి కంపెనీల నుండి వసూలు చేయాలనే అభిప్రాయం ఒకటి బలంగా ముందుకు తేవడం జరిగింది. యిది ఎంత మాత్రం ఆచరణ, ఆమోద యోగ్యం కాదు.

ఈరోజు బహుళజాతి కంపెనీలు, అవి ఏ పేరుతో ఉన్నా, ఏవ్యాపారం నిర్వహించినా, ప్రజావ్యతిరేక 'అమెరికన్' విధానాలనే పరోక్షంగా నిర్వర్తిస్తున్నాయనడంలో ఎట్టి సందేహము లేదు. తమ సరకుల విక్రయం ద్వారా సమకూడిన స్థానిక కరెన్సీతో కొందరు రాజకీయవేత్తలను, లేదా వారి బంధువులను లోబరుచుకోవడం దేశ రాజకీయ ఆర్థిక స్వాతంత్ర్యాలను తమదారికి మళ్ళించుకోవడం మనం ప్రత్యక్షంగా చూస్తున్నాం. బొలీవియా, అర్జెంటీనా, చీలిలలో ప్రభుత్వ సంక్షోభాలు ఈ కార్పోరేషన్ల సృష్టే.

కోట్లాది ప్రజానీకం అనువంశికంగా నిర్వహిస్తున్న చిల్లర వ్యాపారంలోకి విదేశీ కంపెనీల రాకను 'లోకవిద్యా ప్రపంచం' అతి తీవ్రంగా నిరసిస్తుంది. వ్యాపారం పేరుతో ఈదేశంలోకి ప్రవేశించిన 'ఈస్టిండియా' కంపెనీ రైతులను, చేతివృత్తులవారిని ఏవిధంగా ధ్వంసం చేసిందో ప్రత్యక్షంగా చూసిన మనం మరోసారి ఆచారిత్రక తప్పిదాన్ని చేయడాన్ని గర్హించాలి. దీనికి అన్ని రాజకీయ పక్షాలు, స్వచ్ఛంధ సంస్థలు సామాన్య ప్రజల్ని చైతన్యవంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఐ. నాగేశ్వరరావు

**విద్య అంటే సమాజంలో అసమానతలను తొలగించేది.**

## దేశంలో తయారయ్యే విదేశీ మద్యం ద్వారా గ్రామీణ ప్రాంతం నష్టం సాలీనా సుమారు రెండున్నర లక్షల కోట్లు

మన రాష్ట్రంలో సుమారు 3 లక్షల మంది కల్లుగీత రంగంలో పనిచేస్తున్నారు. కృత్రిమ బుట్టలు, చేటలు, ఇంటిరేకులు రాకపూర్వం తాటిచెట్లమీద మరో 3 లక్షల మంది ఉపాధి పొందుతూ ఉండేవారు. తాటిచెట్టు, ఈతచెట్ల నుండి కల్లు తీయటం శ్రమజీవులు త్రాగటం భారతదేశంతోపాటు సమశితోష్ణ మండలాలలో - బంగ్లాదేశ్, కంబోడియా, కామరూన్, చైనా, కాంగో, గబాన్, గాంబియా, ఘనా, ఇండోనేషియా, కెన్యా, లిబియా, మాలీ, మలేషియా, మాల్దీవులు, మయన్మార్, మెక్సికో, నైజీరియా, పిలిప్పైన్స్, సౌత్‌ఆఫ్రికా, శ్రీలంక, తైమూర్ మొదలైన దేశాలలో కోట్లాదిమంది కల్లుత్రాగుతారంటే ఆశ్చర్యం కలుగుతుంది. పూర్వకాలం శ్రమచేసేవారు తాత్కాలికంగా శ్రమమర్చిపోవటం కోసం తగుమోతాదులో తాటికల్లు, ఈతకల్లు, కొబ్బరికల్లు త్రాగేవారు. ఈరోజు బ్రిటీష్ వారి పరిపాలనా ధర్మమాఅని భారతీయులచే తయారయ్యే విదేశీ మద్యం బ్రాంది, రమ్ము, విస్కీ, బీరు మొదలైన వాటిని త్రాగటం ఫ్యాషన్ అయిపోయింది. ఒక క్వార్టరు ఛీప్‌లిక్కర్‌కు 5 రూపాయలు తయారి ఖర్చు అయితే దానిని 60 రూపాయలకు కొని మన రాష్ట్రంలో ప్రభుత్వానికి అధికారికంగా 12వేల కోట్ల రూపాయలు పన్ను రూపేణ కడుతున్నారు. కనీసం అంతేమొత్తం సిండికేట్ల వల్ల షాపువాళ్ళకి ఇస్తున్నారు. దేశం మొత్తంమీద ఆవిధంగా సుమారు 5 లక్షల కోట్లు, అందులో సగం రెండున్నర లక్షల కోట్లు గ్రామీణ ప్రాంతంనుంచి సాలీనా పట్టణ ప్రాంతానికి ప్రవహిస్తోంది. దీని ద్వారా వచ్చే లాభాలు ఏమిటంటే త్రాగుడికి బానిసై రకరకాల వ్యాధులతో మరో రెండున్నర లక్షల కోట్లు వైద్యం కోసం ఖర్చుచేస్తున్నారు. అనేకమందికి కాలేయం, గుండె, మెదడుకి సంబంధించిన వ్యాధులు పెరగటంతోపాటు నేరాలు సంఖ్యకూడా పెద్ద ఎత్తున పెరుగుతోంది. ఇంకా రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యలు లెక్కేస్తే దీనివల్ల సుమారు 1 లక్ష మంది ఏటా మరణిస్తున్నారు.

తాటిచెట్టుని కల్పవృక్షం అనేవారు. తాటాకులతో ఇళ్ళు కట్టుకోవటం, వేసవికాలంలో తాటాకు విసినకర్రలు కొద్దిసంవత్సరాల క్రితందాకా కనిపించేవి. ఇప్పుడు వేసవికాలంలో విద్యుత్ అంతరాయం జరిగితే నరకాన్ని చూస్తున్నారు. సిమెంటు స్లాబ్‌లక్రింద మగ్గుతున్నారు, అదే తాటాకు ఇంటిలో వేసవికాలంలో చల్లగా ఉంటుందని పెద్దలను ఎవ్వరిని అడిగినా చెబుతారు. వేసవికాలంలో వచ్చే శ్రీరామనవమికి తాటాకు పందిర్లు, బెల్లంపానకం పెట్టింది పేరు. పూర్వకాలం కృత్రిమ ప్లాస్టిక్ సంచులు రాకపూర్వం తాటాకు బుట్టల్లోనే కూరలు రవాణా, బెల్లం రవాణా ఆఖరికి హెూటల్ నుంచి భోజనం రవాణా జరిగేది. తాటి దూలాలతో ఇల్లు కట్టేవారు. తాటి పళ్ళతో, తాటికల్లుతో బెల్లం తయారుచేసేవారు. తాటి పళ్ళల్లోనుంచి వచ్చిన టెంకలను పాతి బుర్రగుంజు, తేగలు (గేగులు)కు తద్వారా పీచు పదార్థంతో కూడిన తిండికి దోహద పడేది, మందులా పనిచేసేది. స్వచ్ఛమైన కల్లులో పోటాషియం ఉండటంతో పాటు మలబద్ధ నివారణకు ఔషధంగా పనిచేస్తోంది. కల్తీ కల్లుతోటే సమస్యంతా. దీనితో కలిపే డైజీపామ్, క్లోరల్ హైడ్రేట్ లాంటి మత్తు పదార్థాలవల్ల అనారోగ్యాలు, చావులు సంభవిస్తున్నాయి. ఛీప్‌లిక్కర్‌కు అలవాటుపడినవారికి కల్లు చాలటంలేదు. ఆరోగ్య రంగానికి వస్తే సాధారణంగా విదేశీ మద్యం ఛీప్‌లిక్కర్‌లలో 65% ఆల్కాహాల్ ఉండగా కల్లులో 4 నుంచి 6 శాతం మించదు. స్వచ్ఛమైన కల్లు మోతాదుమించి త్రాగితే నిద్ర తర్వాత వాంతులు లేదా విరేచనాలతో బాధపడుతారు. కాని ఆల్కహాల్ ఉన్న విదేశీ మద్యం త్రాగిన కొలది త్రాగాలనిపిస్తుంది. త్వరితగతిన శరీరంలో మార్పులు సంభవిస్తాయి. మానవ శరీరంలో సుమారు 57 నుంచి 60 శాతం ద్రవ పదార్థం ఉంటుంది. అంటే సామాన్య మానవుడు శరీరంలో 35 నుంచి 40 లీటర్ల ద్రవం ఉంటుంది. 0.1% ఆల్కాహాల్ శరీరంలోకి ఒకటిన్నర క్వార్టర్ల మద్యం వెళ్ళితే మనిషికి విచక్షణ జ్ఞానం పూర్తిగా నశిస్తుంది. తర్వాత తెలియకుండా ఆబగా త్రాగుతారు. దానితో రక్తంలో సుమారు 0.4% మేర ఆల్కాహాల్ చేరితే చావు వెంటనే వస్తుంది.

రాష్ట్రంలో కల్లుగీసేవారు చెట్టుకు నలుగురు చొప్పున లక్షలాది కల్లు చెట్లుపై ఆధారపడి జీవించే కల్లుగీత కార్మికులు ఒకపక్కన ఉన్నారు. ప్రస్తుతం విదేశీ మద్యానికి మనరాష్ట్రంలో సుమారు 1500 మందికి ప్రత్యక్షంగా పనికల్పిస్తోంది. అంటే మూడు లక్షల మంది గీతకార్మికులతో జరిగే వ్యాపారం కన్నా పరోక్షంగా అనేక లక్షల మంది ప్రాణంతకమైన విదేశీ మద్య వ్యాపారంలో బ్రతుకుతున్నారు. అతికొద్దిమంది విజయమల్యా లాంటివారు, కొద్దిమంది రాజకీయనాయకులు ఎదుగుతున్నారు. ప్రజలు తీసుకుతీసుకు చస్తున్నారు. సాలీనా రెండున్నర లక్షల కోట్లు మద్యం పెట్టుబడిదారులకే మరో రెండున్నర లక్షల కోట్లు వైద్యానికి సమర్పిస్తున్నారు.

నారాయణరావు

**జ్ఞానం లాభాలకోసం కాదు.**

# "లోకవిద్య" - ప్రజల సమస్యల పరిష్కారానికి ఏకైక మార్గం

మానవాభివృద్ధి పరిణామక్రమంలో మానవునికి మించిన శక్తి సమాజంలో మరి దేనికీ లేదు. ఐతే, మానవుడు ప్రకృతి విధించిన షరతులకి లోబడి లభివృద్ధిని చేయాల్సి ఉంటుంది. ఈ షరతులను గమనించకుండా అభివృద్ధి పేరుతో జరిపే ప్రతి మార్పును ప్రకృతి వివిధ రూపాలలో విభేదిస్తున్నది. దీనిని గమనించక పోవడం వలనే నేడు మానవజాతి ప్రపంచమంతట అనేక విధాలుగా సమస్యలను ఎదుర్కొనక తప్పడం లేదు. నేడు, ప్రపంచ జనులంతా అనుభవిస్తున్న అభివృద్ధి ఫలాల కంటే చెడు ప్రభావాలు ఎక్కువగా ఉన్నాయి. మానవజాతి మనుగడ ప్రశ్నార్థకంగా తయ్యారయింది. ప్రశ్నార్థకమైన ఈ మానవజాతి మనుగడను అభివృద్ధి పథంలో నడిపించాలంటే మనమందరం ప్రకృతి విధించిన షరతులకి లోబడి చేరువ కావడమే ఏకైక పరిష్కార మార్గం. ప్రకృతి ప్రసాదించిన సంపదను ఆదిమసమాజం నుండి అభివృద్ధి చేస్తూ ఉండటం వలన వచ్చినదే "లోకవిద్య". చదువుతో సంబంధం లేకుండా చూసి నేర్చుకోవడం అనుభవపూర్వకంగా జ్ఞానాన్ని గ్రహించి అభివృద్ధి చేయడం "లోకవిద్య" లో ఉన్న ప్రత్యేకత.

లోకవిద్య అంటే మానవుడు తన అవసరాలకోసం ప్రకృతి నుండి గ్రహించిన జ్ఞానంలో తగిన వస్తు ఉత్పత్తులను తయారు చేయడానికి అందించిన సామాజిక జ్ఞానమైన సహజవిద్య. ఇది క్రమంగా అనుభవపూర్వకమైన అనువంశిక విద్యగా కొనసాగుతూ లోకవిద్యను మించిన మరిక విద్య ఏదీ లేదు అని చాటి చెబుతోంది. ఈ విద్య గొప్పతనాన్ని కొలబద్దగా తీసుకోవడానికి ఎటువంటి డిగ్రీలు ఉండవు. ఎందుకంటే లోకవిద్య నిరంతర సామాజిక జ్ఞానంగా అభివృద్ధి చెందుతూ వచ్చింది. దీనిలో భాగంగానే యంత్ర పరికరాలు అభివృద్ధి చెందక ముందు తమ అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తి సాధనాలను (పనిముట్లను) తయారు చేసి మన అవసరాలను తీరుస్తూ ఎటువంటి ఇబ్బంది లేని జీవనాన్ని మన పూర్వీకులు అనుభవించారు. సమగ్ర సామాజిక బాధ్యతతో కూడిన ఉత్పత్తి వినియోగాలకు ఉపయోగించే సామాజిక జ్ఞానం సమస్త ప్రపంచానికి వర్తించేదే లోకవిద్య.

**ఆధునిక పరిజ్ఞానం - లోకవిద్య**

పెరుగుతున్న శాస్త్ర సాంకేతిక అభివృద్ధి ఉత్పత్తులను ఇబ్బడిముబ్బడిగా పెంచుతుందే తప్ప, ఉద్యోగ కల్పన పెంపొందించడం లేదు. అంతేకాక, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పేరుతో శ్రామిక వర్గ దోపిడిని మరింతగా పెంచింది. మరింత లోతుగా అర్థం చేసుకుంటే ఆధునిక యంత్రాల పేరుతో పెట్టుబడిని మరింత సంయమనం చేస్తుంది (కేంద్రీకరిస్తుంది). దీనిని బట్టి పెట్టుబడిదారి సమాజానికి దోహద పడుతుంది. దీని కారణంగానే భారతదేశంలాంటి విస్తృత జనాభా కలిగియుండి విశాల మార్కెట్ అవకాశాలు ఉన్న దేశంతోపాటు ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలన్నింటిలో ఆధునిక యంత్రాల ఉత్పత్తులు పెరుగుతూ నిరుద్యోగ సమస్య పెరుగుతోంది. 2007 వరకు ప్రపంచ పెట్టుబడిదారులందరీ "పెద్దన్నలాంటి" అమెరికా పెట్టుబడిదారీ ప్రభుత్వంలో నేడు నిరుద్యోగ సమస్య "మహమ్మారి" (పెనురాక్షసి)లా ఉత్పన్నమైనది. భారతదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు ఈ ప్రమాదం నుండి బయటపడాలంటే లోక విద్యను ప్రోత్సహించాలి.

లోకవిద్యను ప్రోత్సహించడం ద్వారానే అభివృద్ధి చెందుతున్న దేశాల్లో చేతివృత్తిదారులను, వ్యవసాయదారులను, ఇతర చిన్నచిన్న చేతివృత్తిదారులకు, చిన్న, సన్నకారు రైతులకు "రక్షణ కవచం" ఏర్పడుతుంది. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధితో పాటు, ప్రతి కుటుంబానికి చేతినిండా పని కల్పించి, తగిన ఉపాధితోపాటు ఆర్థిక స్వావలంబన చేకూర్చుతుంది. తద్వార నిరుద్యోగ సమస్యకు లోకవిద్య పరిష్కారమార్గం అని గర్వంగా చెప్పవచ్చు.

**ఆహారం, ఆరోగ్యం - "లోకవిద్య" పాత్ర**

ప్రపంచంలోని అనేక దేశాలు నేడు ఆహార ధాన్యాల కొరతతో సతమతమౌతున్నాయి. దీని కారణంగా ఆహార ధాన్యాల ధరలు విపరీతంగా పెరిగి ఆహార ద్రవ్యోల్బణం రేటు పెరుగుతున్నది. దీనిలో భాగంగానే భారతదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలన్నింటిలో ఆహార సంక్షోభం గత దశాబ్దకాలం నుంచి తీవ్రమౌతున్నది.

హరిత విప్లవం పేరుతో అధిక దిగుబడులను ఆశించి భూసారాన్ని దృష్టిలో పెట్టుకోకుండా అధికంగా ఎరువులు, పురుగు మందులు (క్రిమి సంహారక) వాడడం వలన భూమికున్న సహజ శక్తిని (భూ సాంద్రత) తగ్గుతూ వచ్చింది. దీని ఫలితంగా పంట మార్పిడి అవకాశమున్న భూములన్నీ నిరుపయోగమవడం కాక పంట దిగుబడులు తగ్గుతున్నాయి. ఫర్టిలైజర్‌కు అలవాటు పడిన పురుగులు నశించక పంటనష్టం చేయడమే కాక పంట పొలాలలో తిరుగాడిన రైతులు చర్మ వ్యాధులతో పాటు శ్వాసకోశ వ్యాధులకూ గురౌతున్నారు. రసాయినిక ఎరువుల ఫలితంగా పంట దిగుబడులు పెరగకపోగా రైతులు వ్యవసాయ ఖర్చుల దెబ్బకి నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. ఈ నష్టాన్ని భరించలేక రైతాంగం పంట విరామాన్ని పాటించడమో లేదా పంట విస్తీర్ణాన్ని తగ్గించడమో చేయటం వలన భారతదేశం లాంటి వ్యవసాయదేశంలో ఆహార ధాన్యాలు, పప్పుదినుసుల కొరత ఏర్పడి ద్రవ్యోల్బణ పరిస్థితిని ఎదుర్కొనవలసి వచ్చింది.

గ్లోబల్ విలేజ్ పేరుతో బ్రిటన్ వుడ్స్‌లో పెట్టిన కవలపిల్లలైన ప్రపంచ బ్యాంకు, ప్రపంచ వాణిజ్య సంస్థ షరతులు అభివృద్ధి చెందుతున్న దేశాలలోని వ్యవసాయ రంగాన్ని మరింత దెబ్బ తీసాయి. కార్పోరేట్ రంగం కార్పోరేట్ వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించే విధానాలే తప్ప, చిన్న సన్నకారు రైతాంగాన్ని వ్యవసాయరంగంపై ఆధారపడి జీవించే పరిస్థితి లేకుండా చేసింది. భారతదేశం లాంటి వ్యవసాయక దేశంలో ఆహార సంక్షోభానికి - ద్రవ్యోల్బణానికి ప్రధానకారణం ఈ విధానాలే.

**లోకవిద్యతో పరిష్కారం**

అనాదిగా చిన్న చిన్న కుంటలు చెరువులపై ఆధారపడి వ్యవసాయరంగాన్ని అభివృద్ధి చేసుకుంటూ ఉండటం వచ్చిన రైతాంగం నేడు సేద్యపు వనరుల కోసం పెద్ద పెద్ద సాగునీటి ప్రాజెక్టులపై ఆధారపడి వ్యవసాయం చేయాల్సి వచ్చింది. గ్రామ సమూహాలకు చెరువులతో అనుసంధానంగా, ఉన్న చెరువులు, కుంటలు, పూడ్చటం వలన సాగునీటి సమస్యతో కొత్తగా త్రాగునీటి సమస్య వచ్చింది.

రసాయనిక ఎరువులు వాడటంలో పంట పొలాలకు సేద్యపు నీరు ఎక్కువగా అవసరం. సేంద్రీయ ఎరువులతో పంటకు నీరు తక్కువ అవసరం అవుతుంది. అంతేగాక రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకం వలన మనిషి ఆరోగ్యాన్ని క్షీణింపచేసే పరిస్థితి ఉండగా సేంద్రీయ ఎరువులతో చేసిన వ్యవసాయం వలన ఆహార ఉత్పత్తులలో పోషక విలువల శాతం తగ్గకుండా హాని లేని ఆరోగ్య భద్రతకు లోకవిద్య దోహద పడుతుంది. అతి కొద్దిపాటి భూమిలో కూడా పంట దిగుబడులకు-- "లోకవిద్య" తో మాత్రమే సాధ్యం. కార్పోరేట్ వ్యవసాయరంగంలో పంట విస్తీర్ణం వందల వేల ఎకరాలకు తగ్గితే నష్టాలూ వస్తాయి. అందువలన భారతదేశ వ్యవసాయరంగానికి ఆహార ఉత్పత్తుల కొరత, సంక్షోభానికి - ద్రవ్యోల్బణానికి, పోషక విలువలతో కూడిన ఆహార ధాన్యాల ఉత్పత్తులకు లోకవిద్య సూత్రాలే పరిష్కారం.

**ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, ఆర్థిక సరళీకరణలో లోకవిద్య అవసరం.**

సామ్రాజ్యవాద పెట్టుబడిదారి సమాజం యొక్క అత్యున్నత దశభాగంగానే ప్రపంచీకరణ ముందుకు వచ్చింది. ప్రపంచీకరణ అమలు జరగాలంటే ఆయా దేశాలలో సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాల అమలు లేకుండా కుదరదు. దీనిలో భాగంగానే భారతదేశంలో 1991 నుండి ఆర్థిక సంస్కరణలను అమలు జరుపుతూ ప్రైవేటీకరణను ప్రోత్సహించారు. ప్రపంచ బ్యాంకు షరతులలో ఒకటైన టెక్నోలజీ ట్రాన్స్మిషన్ పేరుతో ఆధునిక యంత్రాల దిగుమతులు పెరిగి దేశీయ మాన్యుఫాక్చరింగ్ యూనిట్స్ అన్నీ దెబ్బతిని లక్షలాది మంది ఉపాధి కోల్పోయారు. "సెజ్లు" పేరుతో పంట భూములను రైతుల నుండి గుంజుకొని ఉపాధిని దెబ్బ తీయడమే కాక అణు థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులు పేరుతో పర్యావరణాన్ని దెబ్బతీయడం వలన ప్రకృతి వైపరీత్యాలు సంభవించి ప్రాణనష్టాలూ జరుగుతున్నాయి. ఎగుమతి దిగుమతి సరళతరంతో విదేశీ వస్త్ర ఉత్పత్తులు కూడా ఇబ్బడి-ముబ్బడిగా దిగుమతి అవుతూ దేశీయ పరిశ్రమలను సర్వనాశనం చేసారు. అంతేకాక విశాల దేశీయ మార్కెటును బహుళ జాతి సంస్థలు కబళిస్తూ ఆ ఉత్పత్తులకు మార్కెట్ కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న దేశాలు ఉపయోగపడుతున్నాయి. దాని పర్యవసానంగా మార్కెట్ శక్తులపై ప్రభుత్వ నియంత్రణ లేనందున వస్తువుల ధరలు కూడా నియంత్రించలేని స్థితిలో ప్రభుత్వాలు ఉన్నందున ప్రజలు ఆర్థిక ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కొంటూ అతి పేదలుగా ఉండి ఆకలి, అనారోగ్యపు చావులకు బలి అవుతున్నారు. వీరిలో ముఖ్యంగా చేతివృత్తులవారు, చిన్న సన్నకారు రైతాంగం, ఆదివాసులు, దళిత మైనారిటీ ప్రజలు ఎక్కువ శాతం ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ బాధితులుగా మిగిలారు.

లోకవిద్య వాసులంతా కేవలం శారీరక శ్రమ, సామాజిక జ్ఞాన సంపదతో అతి తక్కువ ఖర్చుతో కూడిన ఉత్పత్తి సాధనాల ద్వారా మానవ అవసరాలకు అనుగుణమైన ఉత్పత్తులను తయారు చేసి అందించగలరు. లోకవిద్యలో ఒక వ్యక్తి ఉపాధి పొందడానికి పెట్టుబడి అతి స్వల్పం. ఆధునిక పరిశ్రమలలోని యంత్రముల కొరకు కోట్ల రూపాయల పెట్టుబడి అవసరం. అయినప్పటికి, ఉపాధి కల్పనా అతి తక్కువ. అంతేగాక పర్యావరణ సమతుల్యాన్ని దెబ్బతీసే ప్రమాదం. ఆధునిక యంత్రాల వినియోగాలతో ఉంది. లోకవిద్య పర్యావరణాన్ని కాపాడే లక్ష్యంతో పాటు ఆరోగ్య భద్రతకు భరోసా ఇస్తుంది. అందువలన ప్రపంచీకరణకు ధీటుగా అవసరాలను తీర్చగల శక్తి, ఆర్థిక స్వావలంబనను, ఆత్మగౌరవాన్ని, జీవనోపాధిని నిలబెట్టుకోవడానికి లోకవిద్య పరిష్కారం. ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతులకు, చేతివృత్తుల వారికి మద్దతుగా వారి ఉత్పత్తులను అధికంగా వినియోగించడంతోనే "లోకవిద్య"ను విస్తృతంగా ప్రచారంలోకి తీసుకురాగలుగుతాం.

కావున కార్మిక, కర్షక, విద్యార్థి మేధావులారా! సామ్రాజ్యవాద ప్రపంచీకరణ అమలుతో ఆర్థిక అసమానతల పెరుగుదల పేదరికం మరింత వివిధ రూపాలలో వస్తున్న సంక్షోభాలను ఎదుర్కోవడానికి ప్రపంచ ప్రజలంతా లోకవిద్యను కాపాడుకుంటూ అభివృద్ధి చేయడానికి తమవంతు కృషిచేయాల్సి ఉంది.

**మాచర్ల మోహనరావు**

**జ్ఞానం లాభాపేక్ష కోసం పరిశ్రమ కారాదు**

# ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనా ఆవశ్యకత

దేశంలో 1990వ సంవత్సరము నుండి అభివృద్ధి పేరుతో పాలకులు అమలు చేస్తున్న విధానాలు ప్రజల జీవించే హక్కును హరించి వేస్తున్నాయి. ప్రజలందరికి చెందిన భూమి, నీరు, అటవీ సంపదలు, వ్యవసాయ భూములు రియల్ ఎస్టేట్‌గా మార్పు తీసుకోవటం, చెరువులు కుంటలు పెద్ద ఎత్తున తవ్వడం, నదులు వాగులలో ఇసుక తవ్వకాలు అక్రమ మైనింగ్ ద్వారా భూగర్భంలో నిక్షిప్తమై ఉన్న సహజ వనరుల తరలింపు వలన పర్యావరణం విధ్వంసమవుతోంది. రహదారులు విస్తరణ పేరుతో ప్రజలను నిర్భందం గా తరలించడం ద్వారా ఇల్లు వ్యాపారాలు కోల్పోయి జీవించే హక్కును సంపద కలిగి ఉండే హక్కును కాలరాస్తున్నారు. రాజ్యాంగం ప్రసాదించిన హక్కులు చట్టాలు అభివృద్ధికి అనుకూలంగా మార్పు తీసుకుంటున్నాయి.

రాజ్యాంగ యంత్రం, ప్రభుత్వం, పోలీసులు, రెవిన్యూ అధికారులు అభివృద్ధి క్రమానికి పెట్టుబడికి పూర్తిస్థాయిలో అండదండలందిస్తున్నారు. న్యాయవ్యవస్థలో కూడా అభివృద్ధి నమూనాకి అనుకూలంగా మార్పులు జరుగుతున్నాయి. పంటభూములు నిర్భందంగా సేకరించటం సరికాదనే సుప్రీంకోర్టు తీర్పు కొంత ఆశాజనకం గానే ఉంది. కాని పత్రికలు, మీడియా, సినిమాలు, సాహిత్యం, విద్య అభివృద్ధి క్రమానికి మద్దతు గానే మారాయి. ఈ పరిణామం వలన దేశంలో కొన్ని ప్రాంతాలు ఎడారిగా మారి భవిష్యత్తులో తీవ్రమైన క్షామం ఏర్పడి కోట్లాది ప్రజల జీవితాలు తలక్రిందులయ్యే ప్రమాదముంది లోకవిద్య జన ఆందోళన ఈ అభివృద్ధి క్రమానికి భిన్నంగా ప్రజల హక్కుల పరిరక్షణకు, పర్యావరణ పరిరక్షణకు ప్రజల్ని సమీకరించి సఘటితం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

ఉదా : రంగారెడ్డి జిల్లాలో వ్యవసాయానికి అనువుగా ఉండే భూమి 5.7 లక్షల హెక్టార్లు కాగా ఇందులో 54 వేల హెక్టార్లు చిన్న, పెద్ద చెరువుల ద్వారా సాగులో ఉన్నాయి. రాష్ట్రంలో సరాసరి సాగు 40 శాతం అయితే రంగారెడ్డి జిల్లాలో 9 శాతం మాత్రమే ఉంది. 100 ఎకరాలకు పైగా సాగు అయ్యే చెరువులు 292, 100

(3వ పేజిలో చూడండి)

# భూసేకరణ ఆపండి

ప్రస్తుతం భారతదేశం ఎదుర్కొంటున్న ముఖ్య సమస్య "ప్రజలు వారి గ్రామాలనుండి, నివాసాలనుండి, భూముల నుండి, జీవనాధారమైన వనులనుండి, వృత్తుల నుండి తొలగించబడుతుండటం" ఈ అభివృద్ధి వల్ల ఈ క్రింది సమూహాలు తమ ఉనికిని కోల్పోయే ప్రమాదం ఏర్పడింది.

ఆదివాసులు, గిరిజనులు, రైతులు చేతివృత్తులవారు, తోపుడు బండ్లవారు, చిన్న చిన్న వ్యాపారులు, ఇతర పేద ప్రజలు.

వీరంతా ప్రకృతితో సహజీవనం సాగిస్తూ వారి పారంపర్య జ్ఞానాన్ని పరిపుష్టం చేసుకుంటూ తరతరాలుగా విలువలతో కూడిన జీవనాన్ని సాగిస్తున్నారు. దీనినే మనం లోకవిద్య అంటున్నాం.

లోకవిద్యతో జీవించే వీరిని నిర్వాసితులుగా మార్చేస్తున్నారు. అన్ని వర్గాలు నష్టపోతున్నాయి.

**ఏ సమూహాన్ని నిర్వాసితులుగా మారుస్తున్నారు ఎందుకోసం సంక్షిప్తంగా**

1. **ఆదివాసీలు & గిరిజనులు** : గనులకోసం, విద్యుత్ ఉత్పత్తి పరిశ్రమలకోసం బహుళార్ధసాధక ప్రాజెక్టులకోసం, పెద్ద పరిశ్రమల కోసం, ప్రభుత్వం అడవులకోసం, బృహత్తర మరియు బహుళార్ధసాధక నీటి ప్రాజెక్టులకోసం
2. **రైతులు & రైతు కూలీలు** : విద్యుత్ పరిశ్రమలకోసం, జాతీయ రహదారుల కోసం, పట్టణీకరణకోసం, పెద్దపెద్ద గృహ సముదాయాల కోసం, పట్టణ వ్యర్థపదార్థాల కుప్పలకోసం, పర్యాటక మరియు వినోదం కోసం, వస్తు వినిమయ విధానాలలో భాగంగా ప్రత్యేక ఆర్థిక మండళ్లకోసం, విమానాశ్రయాలకోసం, వస్తు వినిమయ విధానాల భాగంగా ప్రత్యేక ఆర్థిక మండళ్లకోసం.
3. **కళాకారులు & వృత్తికారులు:** ప్రాపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ, విదేశీకరణ, విదేశీ ఉత్పత్తులు, వస్తు వినిమయంలో గుత్తాదిపత్యం కోసం, లాభాపేక్షతో కూడిన ఉత్పత్తి వినమయ విధానాల కోసం
4. **చిన్న వ్యాపారులు & తోపుడు బండ్లవారు మరియు ఇతర పేద వర్గాలు** : పట్టణీకరణ కోసం, ధనవంతులు మాత్రమే ప్రవేశించ కలిగిన వ్యాపార రంగ నిర్మాణంతో సూపర్ మార్కెట్లు గొలుసు మార్కెట్లు నిర్మాణం ద్వారా అతి చౌకగా ప్రపంచంలో ఎక్కడి నుంచైనా తెచ్చి అతిచౌకగా అమ్మటంతో స్థానిక కొనుగోళ్ళపై ఆధారపడిన చిన్నచిన్న వ్యాపారులు పూర్తిగా మాయమైపోతారు.

వస్తూత్పత్తి వినిమయం - అతి చౌకగా ఎక్కడైనా ఉత్పత్తి చేసే ప్రపంచ మార్కెట్టును హస్తగతం చేసుకొనే అంతర్జాతీయ వస్తు వినిమయ విధానాలు అమలు జరపటంద్వారా తమ ప్రాంతం నుంచి నిర్వాసితులుగా మారినవారు చివరకు అయ్యేది చౌక రోజువారీ వేతన కార్మిక వర్గంగా.

1. రైతులు, వృత్తి కళాకారులు, ఆదివాసీలు, గిరిజనులు, చిన్న వ్యాపారులు వారి ప్రాంతాన్ని వదిలి కొత్త చోట వారి జ్ఞానం పనికిరాక ఫ్యాక్టరీలలో, సూపర్ మార్కెట్లలో, పెద్ద ఆసుపత్రులలో ఇతర వ్యాపార సంస్థలలో శారీరక శ్రమ చేసే రోజువారీ వేతన సేవకులుగా మారాల్సి ఉంటుంది.
2. ఇంటి పెద్ద వారికిచ్చిన పరిహారం ఉన్నంత సేపూ ఇంటి ఖర్చు భరించ కలిగినా నెమ్మదిగా ఇంట్లోని ఆడవారు, పిల్లలతో సహా అందరూ రోజువారీ వేతన కార్మికులుగా మారిపోవాల్సి ఉంటుంది.
3. వారివారి సామాజిక హూదాలు కోల్పోయిన ఈ వర్గాలు చివరికి అంతులేని దారిద్ర్యంతో ఆత్మగౌరవాన్ని కోల్పోయే కనీస వేతన కార్మిక వర్గంగా మారిపోవాల్సి ఉంటుంది.

**మహిళాలోకాన్ని ఏవిధంగా కీంచపరుస్తుంది ?**

1. గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ రంగంలో చేతివృత్తుల రంగంలో పనిచేసే స్త్రీలు, రోజువారి వేతనాలకోసం కొత్తచోట కొరగాని లోకవిద్యను వదిలి అగౌరవప్రదమైన పనులు చేయాల్సి ఉంటుంది.
2. తరతరాల నుండి గ్రహించినవారి జ్ఞానం ఎందుకూ కొరగాక కొత్త తరానికి ఏమీ నేర్పలేక ఉన్న పనిలో నేర్పురాక, జ్ఞాన విహీనులుగా మిగిలిపోతారు.
3. వారు శారీరక శ్రమపై కనీస రోజువారీ వేతనాలపై కనిష్ఠ సంపాదనతో బతకాల్సి ఉంటుంది.
4. వారు గౌరవరహిత, అభద్రతా పరిసరాలలో అత్యంత దయనీయస్థితిలో
   - చిన్న ఉత్పత్తి సంస్థలలోని నికృష్ట వేతనంతో
   - నిర్మాణ రంగంలో దినసరి కూలీలుగా
   - ఇళ్ళలో పాచి పనులు చేసేవారి లాగా మారాల్సి ఉంటుంది.

**జ్ఞానం మరియు సాంస్కృతి నష్టాలు**

1 స్థానభ్రంశం మన జీవిత మూలాన్నే నరికేస్తుంది.

2. నిర్వాసితులు మూలాల్ని మరచిన స్థానికత్వం లేని చివరికి ఏమీ లేని పౌరులుగా పేరుకే మిగుల్తారు.
3. నిర్వాసితులు వారిలో లోకవిద్యను, పారంపర విలువల్ని చివరికి సర్వాన్ని పోగొట్టుకున్న వారిగా మిగుల్తారు.
4. వారికి సాంఘిక భద్రత కోల్పోవటంతోపాటు వీరి సాంస్కృతిక జీవితం అతలాకుతలమైపోతుంది.
5. వారి నిర్మాణాత్మక ఆలోచనలు కొత్తచోట పనికిరాకుండా పోతాయి.
6. ఆఖరికి అన్ని మానవ విలవలూ కోల్పోయి యాంత్రిక జీవనాన్ని గడపాల్సి ఉంటుంది.

**దీన్ని ఎవరు ఎక్కడ వ్యతిరేకిస్తున్నారు.**

ఒడిషా రాష్ట్రంలో రైతులు దక్షిణ కొరియావారి పోస్కో కంపెనీ విద్యుత్ సంస్థకు వ్యతిరేకంగానూ, పశ్చిమ బంగ్లా రైతులు నానో, సలీం కంపెనీలకు వ్యతిరేకంగానూ, ఛత్తీస్‌ఘడ్‌లో టాటా, మిట్టల్, జిందాల్, వేదాంత కంపెనీల ఇనుప ఖనిజ తవ్వకాలకు వ్యతిరేకంగా శ్రీకాకుళం జిల్లా సోంపేటలో కాకరపల్లిలో నెల్లూరులో విద్యుత్ ఉత్పత్తి సంస్థలను వ్యతిరేకంగా మధ్యప్రదేశ్ సంగ్రోలిలో అంబానీ, బిర్లా, జెపీ కంపెనీల విద్యుత్ మరియు ఖనిజాల సంస్థలకు వ్యతిరేకంగా ఉత్తర్‌ప్రదేశ్‌లో మహారాష్ట్రలలో ఆఖరికి అన్ని రాష్ట్రాలలోనూ రైతులు భూ సేకరణను వ్యతిరేకిస్తున్నారు.

**ఫలితాలేంటి !**

వివిధ పార్టీల స్థానిక నాయకత్వాలు స్థానిక ప్రజలతో కలిసి భూసేకరణకు వ్యతిరేకంగా ఉద్యమిస్తోంటే, అన్ని పార్టీల జాతీయ నాయకత్వాలూ! కాంగ్రెస్, బిజెపి, సిపిఐ, తెలుగుదేశంతో సహా అభివృద్ధి భూసేకరణ అవసరం అని చెపుతున్నాయి .దీనికి ముఖ్య కారణం ఈ దేశ ప్రణాళిక సంఘం ప్రధాని నాయకత్వంలో జాతీయ స్థాయి ఉద్యోగుల, పోలీసుల, మిలటరీలు సహాయంతో ఈ ఉద్యమాన్ని క్రూరంగా అణచి వేస్తున్నారు. ప్రైవేటు పరిశ్రమలకు ఎర్ర తివాచీలు పరుస్తున్నారు. అన్నిచోట్ల ఉద్యమకారుల్ని పిట్టల్లా కాల్చేస్తున్నారు. దీంతోపాటు కొత్తతరంలో చదువుకున్న వారంతా ఈ అభివృద్ధినే కాంక్షిస్తున్నారు. భారతదేశంలో కేవలం ఐదు శాతం అత్యధిక వేతనాలు పొందే లేదా పొందాలని ఆశించే దానికోసం అర్రులుచాచే యువతకోసం తొంభై అయిదు శాతం ప్రజలు దుర్భర జీవితాన్ని అందుకోవటం అభివృద్ధి అవుతుందా? ఎట్టి పరిస్థితుల్లోనూ కాదు. అందుకే నేటి సమాజంలో ఈ వైరుధ్యాన్ని ఎలా పరిష్కరించాలని ఆలోచించాలి.

**దీనికి ప్రత్యామ్నాయం ఏమిటి ?**

ఈ ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబనలో విపరీతమైన నీటి పరిణామ వినియోగం, ఎరువులు, పురుగుల మందుల ఉపయోగాలు ఎక్కువవ్వటమే కాక, ఆఖరికి వ్యవసాయ ఉత్పత్తులే భారమై మనవే ఎగుమతులు కోరటంద్వారా ప్రాంపచీకరణలో భాగస్వాములవుతున్నాం. భూసారాన్ని కోల్పోటమేకాక వ్యవసాయమే నష్టదాయకంగా తయారు చేస్తున్నాం. లోకవిద్యపై ఆధారపడి ప్రత్యామ్నాయ వ్యవసాయ పద్ధతులతోపాటు చిన్నతరహా నీటి వనరులు, పరిశ్రమలు, చిన్న ఉత్పత్తుల వ్యాపారాన్ని విరివిగా విస్తృతంగా అమలులోకి తీసుకురావాలి. స్థానిక ఉత్పత్తులను మాత్రమే వనియోగించాలి.

ప్రతి ఉత్పత్తిని ఎగుమతులకోసం కాకుండా స్థానిక ప్రజలకోసం తయారు చేయాలి. స్థానిక వస్తువుల వినియోగాన్ని విస్తృతం చేసి పెద్ద పరిశ్రమల్ని పెద్దపెద్ద సూపర్ మార్కెట్లనీ బహిష్కరించాలి. లోకవిద్య ఆధారిత వస్తువులకు సరియైన ధర చెల్లించి విస్తృతంగా వినియోగాన్ని పెంచాలి. చిన్న తరహా పారిశ్రామిక ఉత్పత్తులు, వ్యవసాయదారులు తాము గిట్టుబాటు ధరలు తీసుకోవటమే కాక తమ దగ్గర పనిచేసే వ్యవసాయ కూలీలు, పారిశ్రామిక కార్మికులకు సరియైన వేతనాలు చెల్లించి వారిలో కొనుగోలు శక్తి పెంపొందించాలి. విస్తృతంగా ఉపాధి కల్పించే చిన్న కుటీర పరిశ్రమల స్థాపనకోసం యువత నడుం బిగించాలి. లోక విద్యపై ఆధారపడిన ప్రకృతితో సహజీవనం చేసే నూతన పారిశ్రామిక వ్యవసాయం, ఉత్పత్తి వినిమయ వ్యాపారాన్ని వృద్ధి చేస్తూ ఈ ప్రపంచీకరణని వ్యతిరేకించటంలో సమస్త సమాజాలు విముక్తి పొందుతాయి. దీనికోసం పనిచేసే ప్రణాళికల్ని ఎక్కడికక్కడ తయారు చేసేవారు వివిధ ప్రాంతాలవారు సమన్వయంతో పనిచేయాలి.

**"లోకవిద్య జనాందోళన"**

**జ్ఞానం మానవుడు సంపూర్ణ మానవుడవటానికి దోహదపడాలి.**

**జ్ఞానం సమాజంలోనుంచే ఉద్భవిస్తుంది.**

**వ్యక్తిత్వ వికాసానికి సమాజంలో అందరికి ఉపయోగపడేది జ్ఞానం.**

**(2వ పేజి తరువాత)**

ఎకరాల లోపు సాగు అయ్యే చెరువులు 2295 ఉన్నాయి. రంగారెడ్డి జిల్లాలో చుట్టూ కొండలు దట్టమైన అడవులు మూలంగా గతంలో వర్షాలు కురిసి చెరువులు, కుంటలు పొంగిపొర్లేవి. గత 2 దశాబ్దాలుగా అడవులు నరకడం, వాగులు చెరువులలో ఇసుక తవ్వకాలు పెద్దఎత్తున జరగడం వలన అనేక చెరువులు పూర్తి స్థాయి సామర్థ్యానికి నోచుకోలేదు. మూసీనది నుండి చందస్ వల్లి కత్వా, నందుల కత్వా, రావిరాల చెరువు ద్వారా ఫిరంగి నాలా 85 కి.మీ. ప్రవహించి ఇబ్రహీంపట్నం పెద్దచెరువు నిండేది. ఔటర్ రింగ్ రోడ్డు, శంషాబాద్ విమానాశ్రయం చుట్టుప్రక్కట చెరువులు లోతుగా తవ్వడంతో వాగులు, నదుల ప్రవాహ దిశలో మార్పులు ఎగువ ప్రాంతాలలో తోటల పెంపకం, రియల్ ఎస్టేట్‌గా మార్పు తీసుకోవడం వలన గత 15 సంవత్సరాలుగా చెరువులలో ప్రవాహం తగ్గిపోయింది. భూగర్భ జలాల లభ్యత కన్నా అధిక వాడకం జరగడం వల్ల వర్షపాతం తగ్గి భూగర్భ జలాలు ప్రమాదకరస్థాయిలో పడిపోతున్నాయి.

నిబంధనల ప్రకారం వర్షపు నీరు ఇంకడం రాతి నేలల్లో ఒక శాతం మట్టి నేలల్లో 3 శాతం, ఇసుక నేలల్లో 20 శాతం వరకు నీరు భూమిలోకి ఇంకుతుంది. ఇసుక భూముల మందం 3 మీటర్లు ఉంటే ఒక మీటరు వరకు తవ్వవచ్చు. 8 మీటర్ల కన్నా ఎక్కువ మందం ఉంటే 2 మీటర్ల వరకు తవ్వకం అనుమతించవచ్చు. ఇసుక తవ్వకాలలో ప్రొక్లెయిన్లు, జె.సి.బి.లు వినియోగించకూడదు. వాగులు బాగా ప్రవహించే కాలంలో ఒక సెం.మీ ఇసుక పొర ఏర్పడాలంటే 30 ఏళ్ళు పడుతుంది. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరపడం వలన భూగర్భ జలాల రీఛార్జ్ జరగకుండా రాబోయే కాలంలో వర్షాలు లేక భూగర్భ జలాల లభ్యత కూడా లేకపోతే ఈ ప్రాంతం ఎడారిగా మారడం తధ్యమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అభివృద్ధి పేరుతో జరిగిన విధ్వంసం వలన రంగారెడ్డి జిల్లాలో 40 చెరువుల క్రింద పదివేల ఆయకట్టుకు నీరందక రైతులు నష్టపోయారు. రియల్ బూమ్‌తో వచ్చిన డబ్బు మార్కెట్ మాయాజాలంలో పోగొట్టుకొని హైదరాబాద్‌లో కూలీలుగా రిక్షా కార్మికులుగా మారిపోతున్నారు.

ఈ నేపథ్యంలో అభివృద్ధి ఫలాలు ఎవరికందుతున్నాయి? ప్రజలందరి అభివృద్ధికి ఏ అభివృద్ధి నమూనను ఆయాప్రాంతాల నిర్దిష్ట పరిస్థితులను లోతుగా అధ్యయనం చేసి ప్రజల భాగస్వామ్యంతో రూపొందించాల్సిన అవసరముంది. ప్రజల్ని చైతన్యపరచి ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాతో సంఘటితం చేయాల్సిన ఆవశ్యకత ఎంతయినా ఉంది.

ప్రజాస్వామ్య వ్యవస్థలో అన్ని రాజకీయ పార్టీలు ప్రజా సంఘాలు అమలులో ఉన్న అభివృద్ధి నమూనాను ప్రశ్నించడం లేదు, ప్రజల్ని సమీకరించడం లేదు. ప్రజాసంఘాలు ప్రజల సమస్యలపై ఆందోళన చేస్తే తీవ్ర వాదులనే ముద్రతో పాశవిక నిర్భందాన్ని అమలు చేస్తున్నాయి. పత్రికలు, మీడియా, సాహిత్యం, విద్యా విధానం అభివృద్ధి నమూనాను సమర్థిస్తు ప్రత్యామ్నాయ భావజాలాన్ని ప్రచారం కాకుండా నిరోధిస్తోంది. రాజ్యాన్ని ఎదుర్కోవడమంటే, వీటన్నింటిని అధిగమించి తగిన వ్యూహం ఎత్తుగడలతో నూతన పద్ధతులలో పనిచేయాల్సి ఉంటుందని, పాతపద్ధతులు ఇంకెంత మాత్రం పని చేయవని అర్థం చేసుకోవాలి.

**కె.జె.ఆర్.**

**జ్ఞానం ఏ ఒక్కరి సొత్తు కాదు. ఇతరులను దోచుకోవటానికి పనికొచ్చేది జ్ఞానం కాదు.**





హైద్రాబాద్ యం.జి.బి.ఎస్. బస్‌స్టేషన్‌లో "లోకవిద్య ప్రపంచం" ప్రథమ సంచికను ఆవిష్కరిస్తున్న చౌట అయోధ్య, అచ్చంపేట, కండక్టర్ షాద్‌నగర్ డిపో

# కరువు కాటకాల నివారణకై పర్యావరణాన్ని రక్షించండి

రంగారెడ్డి జిల్లాలో భూమి పరిమాణం 19 లక్షల ఎకరాలుంటే ఇందులో 14 లక్షల ఎకరాలు వ్యవసాయంకు అనువుగా వున్న భూమి. నీటిపారుదల సౌకర్యం వున్న భూమి 1,30,000 ఎకరాలు (9%) మాత్రమే ఇందులో సగం అనగా 70 వేల ఎకరాలు మాత్రమే పంటలు పండుతున్నాయి.

రంగారెడ్డి జిల్లాలో భారీ నీటిపారుదల ప్రాజెక్టులు ఒక్కటి కూడా లేవు. మద్యతరహా నీటిపారుదల కింద కోటిపల్లి ప్రాజెక్టు వుంది. ఆధునీకరణ కింద జపాన్ ప్రభుత్వం 17 కోట్లు నిధులు మంజూరు చేసినా రాజకీయ నాయకులు నిర్లక్ష్యం ఫలితంగా వెనక్కిపోయాయి. చిన్న నీటిపారుదల కింద 292 పెద్ద చెరువులు, ఇబ్రహింపట్నం (1209 ఎకరాలు), రావిరాల చెరువు (1200 ఎకరాలు), 40 చెరువులకు నీరందించే ఫిరంగి కాలువ (1903లో నిజాం కాలంలో నిర్మించారు) షాబాద్ మండలంలో చందనవల్లి కత్వ, షంషాబాద్ మండలంలోని నందుల కత్వ తెగిపోయి ఫిరంగి కాల్వ అనేకచోట్ల కబ్జాలకు గురయి, రియల్ ఎస్టేట్, తోటలు, రోడ్లు, కాలనీలుగా మారి రూపురేఖలు లేకుండా పడివుంది.

మానవ హక్కుల వేదిక జోక్యంతో ఆక్రమణల తొలగింపుకు రూ. 2.54కోట్లు ప్రభుత్వం కేటాయించినా, ఎర్రకుంట చెరువులోకి నీరు వస్తే ఆక్రమించుకొన్న ఇళ్ళు మునిగిపోతాయని చెరువు చుట్టూ గోడ నిర్మించేందుకు తద్వారా ఆక్రమణధారుల రక్షణకు ఉదారంగా ప్రభుత్వం ముందుకొచ్చి శంకుస్థాపన చేసింది. తదుపరి ఆదిబట్ల ప్రాంతంలో టాటా ఏరోస్పేస్‌కు ఫిరంగి కాలువ ప్రాంతాన్ని ప్రభుత్వం సెజ్ పేరుతో దారాదత్తం చేసింది. టాటా కంపెనీ ఫిరంగి కాల్వపై అడ్డంగా గోడకట్టి భవిష్యత్‌లో రైతులు కాల్వల జోలికి రాకుండా గట్టి రక్షణ చర్యలు చేపట్టింది. అంతేగాక సమూహ ఇంజనీరింగ్ కంపెనీకి రియల్ ఎస్టేట్ వెంచర్ నిర్మించేందుకు సెజ్‌పేరుతో కాల్వ మార్గాన్ని మార్చేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఇది నాణానికి ఒకవైపు అయితే నాణానికి మరోవైపు చూస్తే రంగారెడ్డి జిల్లా రూపురేఖలు మారిపోయాయి.

రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం, అవుటర్‌రింగ్ రోడ్డు, ఫ్లైఓవర్‌లు, ఫ్యాబ్‌సిటీ, ఐ.టి. పార్కు, హైటెక్‌సిటీ రకరకాల పేర్లతో భూమిని ప్రైవేట్ కంపెనీలకు అవసరమైన దానికన్నా ఎక్కువగా కట్టబెట్టింది. హైదరాబాద్ చుట్టుప్రక్కల చెరువుల మధ్య వుండే గొలుసు కట్టు లింకులు తెగ్గొట్టి వాగులు, వంకలు ఆక్రమణకు గురవడం వలన నీటి ప్రవాహ దిశను మార్చివేసాయి. అంతేగాక అవుటర్ రింగ్‌రోడ్, రాజీవ్‌గాంధీ విమానాశ్రయం, హైద్రాబాద్ చుట్టుప్రక్కల పుట్టగొడుగుల్లా వచ్చిన ప్రైవేటీ ఇంజనీరింగ్, ఫార్మసీ కాలేజీలు, 40కి పైగా చెరువులలో 6 నుండి 8 లీటర్ల లోతు కందకాలు తవ్వి వేల సంవత్సరాల నుండి సాగునీరందిస్తున్న చిన్న నీటి చెరువుల వ్యవస్థను సర్వనాశనం చేసారు.

ఉదా. మహేశ్వరం మం॥, మంఖాల్ గ్రామంలోని రాయికుంట చెరువులో పెద్ద ఎత్తున తవ్వకాలు జరిపినట్లు గ్రామస్తులు పిర్యాదు చేయడంతో అధికారులు అంచనాలు రూపొందించగా రాయికుంట చెరువులో 36 లక్షల రూపాయల వ్యయం గల మట్టిని తవ్వినట్లుగా నిర్ధారించారు. రావిరాల చెరువును పరిశీలిస్తే ఈ విధ్వంసం ఎంత తీవ్రంగా వుందో అర్థమవుతుంది.

భూగర్భ జలాల పరిస్థితి చూస్తే గత 10 సం॥లలో ఇబ్రహింపట్నం, మంచాల, యాచారం, కందుకూరు, మహేశ్వరం, షంషాబాద్ మండలాలలో ప్రమాదకర పరిస్థితికి చేరాయి. భూగర్భ జలాల అధిక వాడకం కలిగిన మండలాలుగా వుండడమే గాక ఇసక భూములలో అక్రమంగా ఇసుక మైనింగ్ పేరుతో పెద్ద ఎత్తున ఇసుక తరలించడంతో భవిష్యత్‌లో భూగర్భ జలాలు రీచార్జ్ జరగని పరిస్థితి, భవిష్యత్‌లో ఎడారిగా మారి ప్రజలు కూలీలుగా వలసపోయే దుస్థితులు ఏర్పడ్డాయి. ఇప్పటికే వలసల ద్వారా 30% ప్రజలు ఆటోడ్రైవర్‌లుగా, వాచ్‌మెన్‌లుగా, రోజుకూలీలుగా మారిపోయారు. త్రాగు, సాగునీటి కొరతతో వలసపోయే ప్రజల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుంది.

గత 2 దశాబ్దాలుగా వచ్చిన అభివృద్ధి క్రమం రాజధాని నగరంకు కూరగాయలు పండించే రైతుల భూములు రియల్ ఎస్టేట్, సెజ్‌ల పేరుతో బంగారు బాతు కోసుకున్నట్లుగా ఈనాడు ప్రైవేట్ ఆక్రమణలో వున్నాయి. నీటిపారుదల వ్యవస్థ విధ్వంసం, నదీ, వాగుల ప్రవాహ దిశ మళ్ళింపు, ఇసుక మైనింగ్ వలన భూగర్భ జలాలు తగ్గిపోతుండడంతో తీవ్రమైన క్షామ పరిస్థితులు నెలకొని వున్నాయి.

ఇదే సమయంలో అంగుళం భూమి వదలకుండా సిమెంట్ కట్టడాలు హైద్రాబాద్ నగరంలో ప్రతీక్షణం పెరిగిపోతున్నాయి. ప్రతీ ఇంట్లోనూ ఇంకుడు గుంతలు లేకుండా బిల్డింగు అనుమతులు, నీటి కనెక్షన్లు ఇస్తూనే ఉన్నారు. రోడ్ల ప్రక్క ఇంకుడు గుంతలతో సహా సమస్థ రోడ్డు ప్రాంతం సిమెంటు రోడ్లు వేసి వృక్ష సంపద నాశనం చేస్తూనే ఉన్నారు.

హైద్రాబాద్‌కు మంచినీటి సరఫరా పేరుతో పైపులైన్‌తో తరలిస్తున్న నీటిలో కొంతభాగంపై మండలాల్లో త్రాగునీరు సరఫరా చేస్తున్న, త్రాగేనీటికి ధర చెల్లించాలనే ప్రభుత్వ విధానం అమల్లోకొస్తే భవిష్యత్‌లో తాగునీటి ఖర్చు చెల్లించే తాహతు కరువు ప్రాంత ప్రజలకు లేదు. విద్యుత్, తాగునీటి చార్జీలు రాబోయే కాలంలో ప్రజలపై తీవ్రమైన భారం వేసేందుకు పాలకులు విధానాలు రూపొందిస్తున్నారు. ప్రాథమిక విద్య, ఆరోగ్యం, తాగునీరు మొదలైన పనులన్నీ ప్రైవేటు వారి పరం అప్రతిహతంగా జరిగిపోతోంది.

పరిస్థితి తీవ్రతను లోతుగా పరిశీలించి పరిస్థితుల మార్పుకై ప్రజలలో చైతన్యం తేవడం ద్వారా వర్షాకాలంలో ప్రజలు, యువకులు, విద్యార్థులు, గ్రామాలలో, రోడ్లపై వేప, మర్రి, చింత, కొబ్బరి వంటి చెట్లను హార్టీకల్చరల్ శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా చెట్లను సరఫరాచేసి నాటడం, ప్రభుత్వం ట్యాంకర్లతో నీరు సరఫరా చేసి చెట్లకు నీరుపోసేటట్లు చేయడం, ఇసుక మైనింగ్, చెరువుల విధ్వంసంకు బాధ్యులను అరెస్ట్ చేసి జరిమానా వసూలు చేస్తే తవ్విని మట్టి విలువ 100 కోట్లకు పైగా అవుటర్ రింగ్‌రోడ్, రాజీవగాంధీ విమానాశ్రయం, ఇంజనీరింగ్ కాలేజీల నుండి ముక్కుపిండి వసూలు చేసి చెరువుల పునరుద్ధరణకు కృషిచేయడం నీటి ప్రవాహ దిశలను మళ్ళీ కలపడం ద్వారా భూగర్భజలాల పరిస్థితిలో కొద్దికాలంలో మార్పు తీసుకురావచ్చు.

కరువు, క్షామ పరిస్థితుల తీవ్రత ఎక్కువగా వున్న ప్రాంతాలలో ప్రభుత్వం శ్రద్ధ పెట్టి నీటినిల్వ చేయడం, తక్కువ నీటితో డ్రిప్, స్ప్రింక్లర్ ఇరిగేషన్ ప్రభుత్వం స్వంత ఖర్చుతో పూర్తి సబ్సిడితో అమలుచేసి పైన పేర్కొన్న చర్యలు తీసుకుంటే పరిస్థితులలో మార్పు సాధ్యం. కావల్సింది చిత్తశుద్ధి, కరువు ప్రాంత ప్రజలపై శ్రద్ధ వుండాలి.

- సెజ్‌ల పేరుతో దుర్వినియోగంచేసి, పర్యావరణ విధ్వంసానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలి. భూమిని స్వాధీనంచేసుకొని వ్యవసాయంచేసే భూమి లేని రైతులకు, ఆత్మహత్యలు చేసుకున్న కుటుంబాలలోని రైతు స్త్రీలకు కేటాయించాలి.
- హార్టీకల్చర్, వ్యవసాయ శాఖలు చింత, నేరేడు, మర్రి, వేప చెట్లను ఉచితంగా సరఫరా చేయాలి.
- పంచాయితీరాజ్ శాఖ వారు ట్యాంకర్లతో నీరుపోసి ప్రజలు నాటిన చెట్లను పోషణ చేయాలి.
- నీటిపారుదల శాఖ వారు చెరువుల పునరుద్ధరణ, నీటిప్రవాహ దిశలకు లింక్ కలిపేందుకు చర్యలు చేపట్టాలి.
- దీనికి కావల్సిన నిధులను విధ్వంసానికి బాధ్యులైన కాంట్రాక్టర్లు, కంపెనీలపై పెద్ద ఎత్తున జరిమానా విధించి 100 కోట్లు వసూలు చేయాలి.
- ప్రభుత్వం సత్వరం క్షామ పరిస్థితుల నివారణకు నిధులు కేటాయించి క్షామ పరిస్థితులను నివారించాలి.

**కె.జె. రామారావు**

**ఉద్యమ వార్తలు పంపించవలసిన చిరునామా :**
Loka Vidya Prapancham
D.No. 10-100, New Gaddiannaram,
Hyderabad - 500 060. Ph : 040-24152155
e-mail : tnrkoundinyasa@yahoo.com

**అన్ని రకాల విద్యలు, వృత్తులు సమానమే**

**BOOK - POST PRINTED MATTER**
**JANUARY 16. 2012**

**To,**

**Printed, Edited & Published by T. Narayana Rao B.Com., LL.B. D.No. 10-100, New Gaddiannaram, Hyderabad - 500 060.**